

# ఇంటర్వ్యూ

- ప్రతాప వెంకట సుబ్బారాయుడు

**మా** ఎడిటర్‌గారు హాస్యనటుడు హాస్యరసంని ఇంటర్వ్యూ చేసే అవకాశం నాకు ఇవ్వడంతో ఆనందంగా బయల్దేరాను.

ఫిల్మ్‌నగర్‌లో ఆయన బంగళా ముందుగేటుకి ఒక పక్క 'హాస్యనటుడు హాస్యరసం' అని, మరో పక్క 'నవ్విస్తూ చంపేస్తాను, జాగ్రత్త!' అని బోర్డ్ చూసి ఆశ్చర్యానందాలు కలిగాయి. గేటు దగ్గరే ఆయన హాస్యచతురత అవగతమైంది. అందుకే ఆయన గొప్ప నటుడయ్యాడు.

నేను సెక్యూరిటీలోని అతనికి ఇంటర్వ్యూ కోసం వచ్చిన విషయం చెప్పాను. ఆయన అతనికే ముందే చెప్పి పెట్టాడనుకుంటా. కాల యాపన చెయ్యకుండా గేటు తెరచి నన్ను లోప లికి పంపాడా సెక్యూరిటీ అతను.

లోపల లాన్‌లో టీ తాగుతున్నాడు ఆంధ్రుల ఆరాధ్య హాస్యనటుడు హాస్యరసం. నేనూ ఆయన్ను చూడటం ఇదే మొదటిసారి. నాకు ఉత్సాహంగా, ఉద్వేగంగా వుంది.

"నమస్కారమండీ" అన్నాను.

"ఆ.. రండి.. రండి నేను పనులేమీ పెట్టు కోకుండా.. మీ కోసమే ఎదురు చూస్తున్నాను.. కూర్చోండి" అని ఆహ్వానించాడు.

నాకు టీ పోసి.. తాగమని చెప్పి, తనూ టీని సాసర్‌లో పోసుకుని మూతి చుంచెలుకలా పెట్టి గట్టిగా శబ్దం చేస్తూ లోపలికి పీల్చుకుంటున్నాడు. అది చూసి నాకు బాగా నవ్వు వచ్చింది.

"చూశారా.. మిగిలినవాళ్లకి, హాస్యనటులకీ తేడా వుండాలి. ఇలా సర్వకాల సర్వావస్థల్లోను హాస్యరసాన్ని పండించాలి. అప్పుడే పదికాలాల పాటు నిలబడగలం" అన్నాడు.

ఎంత సమయస్ఫూర్తి? టీ తాగుతూ నవ్వించడం ఎవరైనా చెయ్యగలరా? చుట్టూవున్న వాళ్ళు వెటకారంగా చూస్తారని ఒకవేళ మనసులో అలాంటి కోరిక ఉన్నా అలా చెయ్యరుగాక చెయ్యరు. కానీ వీళ్ళకి అది ప్రివిలేజ్.

## చతుర కథ

"నిజమేనండి.. మరి ఇంటర్వ్యూ ప్రారంభిద్దామా? "

"రంభిద్దామా? ..ఎవరికో ఎందుకు? రంభని నాకిచ్చెయ్యండి"

"ఓహ్! మళ్ళీ కామెడీ!" పగలబడి నవ్వాను.

"మొదటి ప్రశ్న.. యాక్టర్లు సాధారణంగా

డాక్టర్లు కాలేరు యాక్టర్లమయ్యామంటారు కదా.. మరి మీరు? "

"నేను మెడికో అవ్వాల్సింది.. 'కామెడీ'కో అయ్యా.. హహ్హా!"

"మళ్ళీ కామెడీ!" పగలబడి నవ్వాను.

"హాస్యనటుడిగా మీ ఎంట్రీ చిత్ర పరిశ్రమలో ఎలా జరిగింది? "

"ఒకరోజు రవీంద్రభారతిలో 'చచ్చు పుచ్చు బుర్ర' నాటకంలో తలగోక్కుంటూ.. గోళ్ళు కొరుక్కుంటూ ప్రధాన పాత్రలో నటించా. నా అదృష్టం.. ఆ నాటకం చూడడానికి హాస్య చిత్ర దర్శకుడు కడుపుబ్బసం వచ్చాడు. పాత్రలో పూర్తిగా లీనమై నన్ను చూసి వెంటనే తన సిని మాలో ఛాన్స్ ఇచ్చాడు. ఇహ అప్పటి నుండి.." మూతి ఓ రకంగా పెట్టి, కళ్ళు చిట్లించి తనదైన స్టయిల్లో చెప్పాడు.

"మీ చిన్నప్పటి హాస్య చేష్టలేమన్నా...? "

"ఓహ్.. నా చిన్నప్పుడు... ఆహ్.. నా చిన్న ప్పుడు" అని మెలికలు తిరిగిపోతూ అరగంట నవ్వి, "మా ఊరు దురదపాడు. అక్కడ నా పేరు ఎవరికీ తెలిసేది కాదు. కోతిగాడు అంటేనే తెలి సేది. ఎవరన్నా మానాన్న కోసం వచ్చినా 'కోతి గాడిల్లు ఏది?' అని అడిగితేనే.. ఎవరైనా మా ఇంటి దగ్గరికి తీసుకొచ్చి దింపేవారు. నాకా పేరు రావడానికి కారణం వుంది. మా స్కూల్లో బాలల దినోత్సవం సందర్భంగా కోతికొమ్మచ్చి నాటకం వేశాం. అందులో నాది ప్రధాన పాత్ర! కోతిచే ష్టలు చేస్తూ కుప్పిగంతులెయ్యాలి. చాలామంది నేను కోతినే అనుకున్నారు. 'కోతి భలే చేస్తోందే!' అన్నారు. 'అది కోతి కాదండి. మనిషే.. కానీ నటనలో జీవించాడు' అని ఎంత చెప్పినా ఎవరూ నమ్మలేదు. ఆ నాటకంలో బెస్ట్ యాక్టర్ అవార్డు వచ్చింది. అంతేకాదు కళ్ళు చిదంబరం.. పావలా శ్యామలవంటి వారికిలాగే నా పేరుకి ముందు కోతిగాడు చేరింది. ఇప్పటికీ పరిశ్రమలో నన్నలాగే పిలుస్తారు తెలుసుగా? " అన్నాడు, కోతిలా చొక్కాగుండీలు గబగబ తీసిపెట్టుకుంటూ.

నాకు నవ్వాగలేదు.

"మీరు నటించిన.. మీకు బాగా నచ్చిన సన్ని వేశం? "

"కామెడీ జ్ఞాకొ సినిమాలో ఒక పాత్ర చనిపోతే శ్మశానం దగ్గర చొక్కాలుంగీ చింపేసుకుంటూ శోకసముద్రంలో ఉన్నవాళ్ళని నవ్వించాలి. నేను అలా నటించేసరికి అక్కడ శవ దహనానికి వచ్చి నవాళ్ళు.. కాటికాపరి కూడా విరగబడి నవ్వారు. శ్మశానంలో సహజంగా అందరూ దుఃఖితులై వుంటారు. మొట్టమొదటిసారి అక్కడందర్నీ నవ్వించా. ఆ సినిమాలో నా పాత్రకి హాస్య రసపోతు అవార్డు కూడా వచ్చింది"

"మరొకసారి కంగ్రాట్స్ అండీ. మరి మీరు చెయ్యాలనుకుంటున్న డ్రీమ్ రోల్..పాత్ర? "

"సినిమాల్లో ఇలా క్యారెక్టర్ ఆర్టిస్ట్‌లా కాకుండా ఫుల్ లెంగ్త్ కామెడీ పాత్ర చేసి అందరికీ పిచ్చె క్కించాలని ఉంది"

"మీ ఆశ తప్పక నెరవేరుతుందండి.. మీ భార్యా..పిల్లల గురించీ..? "

"మా ఆవిడ పేరు అప్పలనరసు. మా మావయ్య కూతురే! ఒకే కొడుకు.. హసికరాజా.. కూతురు నవ్వుల మల్లి"

"పిల్లల పేర్లు ఏమిటలా ఉన్నాయి? "

"నేనీ రోజు ఇలా ఉన్నానంటే.. జనం నవ్వ డమే కారణం. అందుకే కృతజ్ఞతగా పిల్లలకు ఆ పేర్లు పెట్టాను"

"సరే.. ఇహ విమర్శల విషయం మాట్లాడుకుం దాం.. మీరు చాలా ఓవర్‌గా చేస్తారని.. టాక్"

"ఎవరన్నారండి.. నవ్వలేని సన్నాసులు.. నవ్వురాని వెధవాయలు అనుంటారు. టాలెంటేమీ లేకుండానే పరిశ్రమనిలా ఏలుతున్నానా? " నవ్వులో కోపం మిళితం చేసి మిడత ముఖంతో అన్నాడు.

"నిజమేనండి.. మీరు హాస్యరస చక్రవర్తి అన్నది నూటికి నూరుపాళ్ళ నిజం"

"ఇంటర్వ్యూ కోసం ఇందాకటి నుంచి ఫోన్ స్విచ్ఛాఫ్‌లో పెట్టా.. ఇప్పటికే బోలెడన్ని కాల్స్ వచ్చుంటాయి.. ఒకసారి చూస్తాను" అని ఫోన్ స్విచ్ఛాన్ చేశాడు.

"అబ్బో మెస్సేజీల మీద మెస్సేజీలు. నేనున్నది ఒకడ్ని. అందరికీ కావాలి. ఎలా కుదురుతుంది? నేనూ మనిషినే కదా! వాళ్ళకి నా మీద పిచ్చ అభి మానం. నేనుంటే కచ్చితంగా బొమ్మ వందాడు తుందనీ"

"మా పాఠకులకి ఏవన్నా చెప్పాలనుకుంటు న్నారా? " ఇంటర్వ్యూకి ముగింపు పలుకుతూ చివరి ప్రశ్న అడిగా.

"నేను నవ్వించడం.. మీరు నవ్వడం ప్రధానం. కాబట్టి థియేటర్‌లోకి వచ్చింది మొదలు పిచ్చిపట్టి నట్టు నవ్వండి.. నవ్వుతూనే వుండండి.. హహ్హా...హ్హా"

"అలాగే!" అని చెప్పి మనసులో 'హతోస్మి' అనుకుంటూ బయల్దేరాను. ©